సాక్షి నల్లగొండ

ఆదివారం । 7 । మే । 2023



రెండు షిఫ్టులు.. 16 గంటలు !

నాగార్జునసాగర్ డ్యాం స్పిల్‌వే మరమ్మతు పనులు వేగంగా జరుగుతున్నాయి. రెండు షిఫ్టుల్లో పనులు చేపడుతున్నారు. - 10లో



చేనేత రంగాన్ని పరిరక్షించాలి

చేనేత రంగాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైన ఉందని ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. - 10లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33°/25°

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఈదురు గాలులు ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పలువురు సీఐల బదిలీ

నల్లగొండ క్రైం : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పలువురు సీఐలను బదిలీ చేస్తూ నార్త్ జోన్ ఐజీ కమలాసన్‌రెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. పటాన్‌చెర్వు సీఐ కె.బీసన్నను సాగర్‌కు, వీఆర్‌లో ఉన్న సీఐ నాగరాజును పీసీఆర్ నల్లగొండకు, సీసీఎస్ నల్లగొండలో ఉన్న సీఐ సాయివెంకటకిషోర్‌ను డీసీఆర్‌బీ సంగారెడ్డికి, కోదాడ సీఐ పీఎన్‌డీ ప్రసాద్‌ను నల్లగొండ టూటౌన్‌కు, నల్లగొండ టూటౌన్ సీఐ చంద్రశేఖర్‌రెడ్డిని గద్వాల జోగులంబ జిల్లా సీసీఎస్‌కు బదిలీ చేశారు.

3.23 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

- కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

నల్లగొండ : జిల్లాలో ఇప్పటి వరకు 3 లక్షల 23వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. ధాన్యం కొనుగోళ్లు, ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శనివారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా నుంచి కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రోజూ దాదాపు రూ.40 కోట్ల విలువ గల 18వేల మెట్రిక్ టన్నుల నుంచి 20 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు వెల్లడించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి చెల్లింపులు సత్వరం పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుంచి అదనపు కలెక్టర్లు ఖుష్బూగుప్తా, భాస్కర్‌రావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలి

- ఎస్పీ అపూర్వరావు



మాట్లాడుతున్న ఎస్పీ అపూర్వరావు

నల్లగొండ క్రైం : జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఎస్పీ అపూర్వరావు సూచించారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జాతీయ, రాష్ట్ర, జిల్లా రహదారుల అధికారులు, పోలీసులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రహదారులపై ఇష్టానుసారంగా వాహనాలు నిలపకుండా నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. బ్లాక్ స్పాట్‌ల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు, బారీ కేడ్లు, రేడియం స్టిక్కర్లు, లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. అతి వేగం, ఓవర్ టేక్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, మద్యం తాగి వాహనాలు నడపడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. వాహనదారులు సీటు బెల్ట్, హెల్మెట్ ధరించేలా చైతన్యం చేయాలని సూచించారు. సమావేశంలో ట్రైనీ ఐపీఎస్ శేషాద్రినిరెడ్డి, డీఎస్పీలు నర్సింహారెడ్డి, వెంకటగిరి, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత

పోలీస్ కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తామని ఎస్పీ అపూర్వరావు పేర్కొన్నారు. ఏఆర్ విభాగంలో పనిచేస్తూ అనారోగ్యంతో మృతిచెందిన హెడ్ కానిస్టేబుల్ బాబునాయక్ భార్య పద్మకు శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో రూ.7 లక్షల74వేల చేయూత చెక్‌ను ఎస్పీ అందజేశారు. పోలీస్ మృతుల కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏఓ మంజుభార్గవి, పోలీస్ సంఘం జిల్లా అధ్యక్షుడు జయరాజ్, సోమయ్య తదితరులు ఉన్నారు.

ఐసీడీఎస్ పీడీ బదిలీ

నల్లగొండ : మహిళా, శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి సుభద్ర పదోన్నతిపై బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఆమె మహిళా, శిశు సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేస్తుండగా.. ప్రభుత్వం డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పిస్తూ ఆదిలాబాద్‌కు బదిలీ చేసింది. యాదాద్రి భువనగిరి జిల్లాలో అడిషనల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న కృష్ణవేణిని నల్లగొండకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

638 అడుగులకు మూసీ నీటిమట్టం

కేతేపల్లి : జిల్లాలో నాగార్జునసాగర్ తర్వాత అతిపెద్ద సాగునీటి వనరుగా ఉన్న మూసీ ప్రాజెక్టులో నీటిమట్టం 638 అడుగులకు చేరుకుంది. శనివారం ఎగువ నుంచి మూసీకి 1,370 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. మూసీ పూర్తిస్థాయి నీటిమట్టం 645 అడుగులు కాగా శనివారం సాయంత్రానికి 638 అడుగులకు చేరుకుందని అధికారులు పేర్కొన్నారు.

వృత్తి పోలీస్.. ప్రవృత్తి సేవ

స్ఫూర్తి

ఆయనో పోలీస్ అధికారి.. ఉన్నతస్థాయి ఉద్యోగం.. అయినా గ్రామాల్లో పేదలకు కనీస వైద్యం అందించాలనేది ఆయన సంకల్పం. ఉద్యోగరీత్యా ఎక్కడ పనిచేసినా ఉద్యోగంతోపాటు సేవా కార్యక్రమాలను కొనసాగించడం ప్రవృత్తిగా పెట్టుకొని ముందుకు సాగుతున్నారు. ఆయనే చౌటుప్పల్ ఏసీపీ నూకల ఉదయ్‌రెడ్డి. తాను ఎక్కడ పనిచేసినా కార్యక్రమాలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు. పనిచేసే ప్రాంతాల్లోనే కాదు.. తాను పుట్టిన ఊరు కోసం ఏదైనా చేయాలన్న సంకల్పంతో ఆస్పత్రిని నిర్మించి ఆ గ్రామ పరిసరాల్లోని 12 గ్రామాలు, తండాలకు చెందిన పేదలకు ఉచిత వైద్యం అందిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు.

- సాక్షి ప్రతినిధి, నల్లగొండ

- పుట్టి పెరిగిన ఊరిపై మమకారం
- సామాజిక సేవా కార్యక్రమాల్లో చౌటుప్పల్ ఏసీపీ ఉదయ్ రెడ్డి
- తన స్వగ్రామం మిర్యాలగూడ మండలం కొత్తగూడెంలో వైద్య సేవలు
- భూమి ఇచ్చి, రూ.80 లక్షలతో ఆస్పత్రి నిర్మించిన ఉదయ్



చౌటుప్పల్ ఏసీపీ ఉదయ్‌రెడ్డి



మిర్యాలగూడ మండలం కొత్తగూడెంలో కట్టించిన ఆస్పత్రి

గ్రూప్-1, 2017 బ్యాచ్‌కు చెందిన నూకల ఉదయ్‌రెడ్డి మొదటగా ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరులో పనిచేశారు. ఆ సమయంలో పేదలు ఆరోగ్యపరంగా ఎన్నో ఇబ్బందులు పడుతుండేవారు. కడుపునొప్పి ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మెరుగైన వైద్యం చేయించుకోలేక ఆత్మహత్య చేసుకున్న సంఘటనలకు సంబంధించిన కేసులు తన దగ్గరకు వచ్చేవి. వాటిని విని చలించిపోయిన ఉదయ్‌రెడ్డికి అప్పుడే ఓ ఆలోచన వచ్చింది. పేదలకు వైద్యసదుపాయం అందుబాటులోకి తేవాలని భావించారు. దాంతో అక్కడి గూడేలన్నీ తిరిగారు. ఆ సమయంలోనే ఓ పెద్ద మనిషి.. తనకు కళ్లు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కడికి వెళ్లాలో కూడా తెలియనంత అమాయకత్వంతో బతుకుతున్న గిరిజనులకు అండగా నిలవాలనుకున్నారు. వెంటనే హైదరాబాద్‌లోని ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి యాజమాన్యంతో మాట్లాడి 300 మందిని అక్కడ చూపించారు. 50 మందికి ఆపరేషన్లు అవసరం ఉంటే చేయించారు. మిగిలిన 250 మందికి కళ్లద్దాలు ఇప్పించారు. ఆ తరువాత ఆదివాసిగూడేల్లో వైద్య శిబిరాలు నిర్వహించడంతోపాటు అక్కడ యువతకు ఉద్యోగాల కోసం జాబ్ మేళాను నిర్వహించి 600 మంది యువతకు ఉద్యోగాలు ఇప్పించారు. అందులో అమేజాన్ లాంటి సంస్థల్లో ఉద్యోగాలు పొందిన వారు ఉన్నారు.

రిటైర్డ్ డీజీపీ సూచనతో సర్వేల్ స్కూల్ దత్తత

సర్వేల్ స్కూల్‌లో చదివిన రిటైర్డ్ డీజీపీ మహేందర్‌రెడ్డి సూచన మేరకు స్కూల్‌ను దత్తత తీసుకున్నారు. ఇప్పటికే ఆ స్కూల్లో జనరేటర్ ఏర్పాటు చేశారు. రూ.25లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టారు.

సొంతూరుపై మమకారంతో..

ఆ తరువాత చౌటుప్పల్ ఏసీపీగా వచ్చిన ఉదయ్‌రెడ్డి తాను పుట్టిన ఊరికి సేవ చేయాలనుకున్నారు. తాను పుట్టి పెరిగిన మిర్యాలగూడ మండలం కొత్తగూడెం గ్రామంలో ఆసుపత్రి లేదు. పరిసరాల్లోని 12 గ్రామాలదీ అదే పరిస్థితి. అక్కడివారంతా వైద్య సదుపాయం కోసం మిర్యాలగూడలోని ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లాల్సి వచ్చేది. అత్యవసర సమయంలో వైద్యం అందక ఒక్కోసారి ప్రాణాలు పోతున్న దయనీయ పరిస్థితిని చూసిన ఉదయ్‌రెడ్డి అక్కడ ఆసుపత్రి నిర్మించాలనుకున్నారు. తమకున్న 380 గజాల స్థలంలో తన తండ్రి నూకల వెంకట్‌రెడ్డి చారిటబుల్ ట్రస్టు పేరుతో రూ.80 లక్షలతో ఆసుపత్రి నిర్మించారు. ప్రస్తుతం అందులో 35 రకాల పరీక్షలు చేయడంతోపాటు డాక్టర్‌ను నియమించి ప్రతి రోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు వైద్య సేవలు అందిస్తున్నారు. డాక్టర్‌తోపాటు ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్టు, ఇద్దరు నర్సులు, ఆయాలను ఏర్పాటు చేశారు. ఆస్పత్రి నిర్వహణ, వారికి వేతనాలకు ప్రతి నెలా రూ.లక్షన్నర వెచ్చిస్తున్నారు.



ఆస్పత్రి ప్రారంభోత్సవంలో మంత్రి జగదీశ్‌రెడ్డి, ఉదయ్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు (ఫైల్)

సేవలు విస్తరిస్తాం

ముమ్ముందు వైద్య సేవలను విస్తరిస్తాం. ప్రతినెలా హైదరాబాద్ నుంచి ఐదుగురు స్పెషలిస్టు డాక్టర్లను తీసుకురావాలని సంకల్పించాం. ప్రస్తుతం మందులకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్‌ఆర్) కింద నాస్ ల్యాబరేటరీస్ సహకారం అందిస్తోంది. పేదలకు ప్రాథమిక స్థాయిలో మంచి వైద్యం అందితే సెకండరీ వైద్యం అవసరం తక్కువ. ప్రాథమిక వైద్యానికి కూడా ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి వేల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది. అందుకే ఇక్కడ ఆ సేవలను అందిస్తున్నాం. వైద్య పరికరాలకు అయ్యే ఖర్చు మాత్రమే తీసుకుంటున్నాం.

- నూకల ఉదయ్‌రెడ్డి, ఏసీపీ, చౌటుప్పల్

రూ.15 లక్షలతో పాఠశాల అభివృద్ధి

పేదలకు సేవలందిస్తే మనకు వారి ఆశీర్వాదం ఉంటుందని, ఆరోగ్యంగా ఉంటామనే నమ్మకం ఉదయ్‌రెడ్డి కుటుంబానిది. ఆయన కుటుంబ సభ్యులు కూడా సేవా కార్యక్రమాల్లో ఉన్నారు. గ్రామంలో పాఠశాల కోసం ఆయన తాత నూకల నారాయణరెడ్డి 15 గుంటల భూమి దానం చేశారు. అందులో ఉన్న పాఠశాల భవనం ప్రస్తుతం పాడైపోవడంతో రూ.15 లక్షలతో బాగుచేయించారు. టాయిలెట్లు, విద్యుదీకరణ, పాఠశాలకు రంగులు, కిటికీలు, ఫ్యాన్లతోపాటు బెంచీలను ఏర్పాటు చేశారు.

చిన్న జబ్బులన్నింటికీ ఇక్కడే చికిత్స



చిన్న జబ్బులకు ఇక్కడనే చికిత్స అందుతోంది. పెద్ద జబ్బులు వస్తేనే మిర్యాలగూడకు వెళ్తున్నాం. గ్రామంలో ఆసుపత్రి ఏర్పాటు చేయడంతో ఖర్చులు తగ్గాయి.

- రాచమల్ల వెంకటయ్య

ఆస్పత్రి ఏర్పాటుతో బాధలు తప్పాయి



గ్రామంలో ఆస్పత్రి నిర్మించి వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చారు. చిన్న జబ్బు వచ్చినా మిర్యాలగూడకు వెళ్లాల్సిన బాధలు తప్పాయి.

- జొన్నలగడ్డ భాగ్యమ్మ

ప్రజలను చైతన్యపర్చడం అభినందనీయం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, జన విజ్ఞాన వేదిక నాయకులు

- ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి
- నల్లగొండలో జేవీవీ రాష్ట్ర 4వ మహాసభ

నల్లగొండ టౌన్ : జనవిజ్ఞాన వేదిక సభ్యులు సమాజంలోని అసమానతలు, మూఢనమ్మకాలపై ప్రజలను చైతన్యం చేసే దిశగా కృషి చేయడం అభినందనీయమని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానికంగా జరిగిన జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర 4వ మహాసభను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుతం పాలకులు ప్రకృతి వనరులను కార్పొరేట్ శక్తులకు దాసోహం చేస్తూ అభివృద్ధిని మరిచిపోతున్నారని విమర్శించారు. జేవీవీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కెఎల్.కాంతారావు మాట్లాడుతూ అంతర్జాతీయంగా, రాష్ట్రంలో కూడా సైన్స్‌కు, పరిశోధనలకు ఎలాంటి ప్రోత్సాహం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు ప్రజలను మూఢత్వం వైపు మరల్చుతూ చైతన్య రహితులను చేస్తున్నారని ధ్వజమెత్తారు. జన విజ్ఞాన వేదిక కార్యకర్తలు ప్రజల్లో చైతన్యం తీసుకురావడంతో పాటు సైన్స్‌పై మరింత ప్రచారం నిర్వహించాలని పిలుపునిచ్చారు. అంతకుముందు జేవీవీ ఉద్యమ పతాకాన్ని కోయ వెంకటేశ్వరరావు ఆవిష్కరించి మహాసభకు అధ్యక్షత వహించారు. డాక్టర్ సీహెచ్.మోహన్‌రావు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, కార్యదర్శి అమరయ్య, రాష్ట్ర కార్యదర్శి వెంకటరమణారెడ్డి, నర్సింహ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పొంగులేటితో చకిలం భేటీ

- ఖమ్మం వెళ్లి రాజకీయ భవిష్యత్‌పై చర్చించిన నల్లగొండ నేత
- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అసంతృప్తులు ఎవరన్న దానిపై చర్చ
- నెలాఖరుకు తుది నిర్ణయం తీసుకుందామని చెప్పిన పొంగులేటి?

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : బీఆర్‌ఎస్ మాజీ అసంతృప్త నేతలు ఖమ్మంలో సమావేశమయ్యారు. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో శనివారం జరిగిన ఈ సమావేశంలో నల్లగొండ జిల్లాకు చెందిన చకిలం అనిల్‌కుమార్ తదితరులు భేటీ అయ్యారు. బీఆర్‌ఎస్ తనకు తగిన ప్రాధాన్యం ఇవ్వలేదన్న కారణంతో ఇటీవలే ఆ పార్టీకి రాజీనామా చేసిన అనిల్‌కుమార్, ఇదే కోవలో బీఆర్‌ఎస్‌ను వీడిన పొంగులేటితో భేటీ కావడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమవుతోంది. బీఆర్‌ఎస్ పట్టించుకోని కీలక నేతలందరినీ ఏకం చేయాలనే ఆలోచనలో పొంగులేటి ఉన్నారని చాలా కాలంగా ప్రచారం జరుగుతున్నా తాజాగా అనిల్‌కుమార్ లాంటి నాయకుడితో ఆయన భేటీ కావడం ఈ ప్రచారాన్ని నిజం చేసిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అటు కాంగ్రెస్‌లోకి వెళ్లాలా? ఇటు బీజేపీలోకి వెళ్లాలా? లేక సొంత పార్టీ పెట్టాలా అనే మీమాంసలో ఉన్న పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి బృందం ఈనెలాఖరుకు ఏదో ఒక నిర్ణయం తీసుకునే అవకాశముందని తెలుస్తోంది. చకిలం అనిల్‌తో భేటీ సందర్భంగా ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి వచ్చే నాయకులందరినీ సమన్వయం చేసుకోవాలని, ఈనెలాఖరులో ఏదో ఒక నిర్ణయం తీసుకుందామని పొంగులేటి చెప్పినట్టు తెలిసింది. ఈనెలాఖరులో ఖమ్మంలో, ఆ తర్వాత మహబూబ్‌నగర్‌లో, ఆ తర్వాత నల్లగొండలో భారీ సభలకు కూడా ప్లాన్ చేయాలన్న అంశంపై ఇరువురు నేతలు చర్చించినట్టు తెలిసింది.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : చిరుమర్తి

నార్కట్‌పల్లి : రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. శనివారం నార్కట్‌పల్లి మండలంలోని బ్రాహ్మణవెల్లెంలలో ఉదయ సముద్రం ప్రాజెక్టు ట్రయల్ రన్‌ను ఆయన పరిశీలించి మాట్లాడారు. బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టులో నీళ్లు చూస్తుంటే ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇంతటి అదృష్టాన్ని నాకు ఇచ్చిన సీఎం కేసీఆర్‌కు జీవితాంతం రుణపడి ఉంటానని తెలిపారు.



నీళ్లలో పూలు చల్లుతున్న ఎమ్మెల్యే లింగయ్య

వారం రోజులు.. 86 కిలోమీటర్లు



పోచంపల్లి పట్టణంలో చేనేత కార్మికుల దీక్షలో మాట్లాడుతున్న సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

- యాదాద్రి జిల్లాలో ముగిసిన భట్టివిక్రమార్క పీపుల్స్ మార్చ్ పాదయాత్ర
- శ్రీనివాసపురంలో ప్రారంభమై జలాల్‌పురంలో ముగింపు
- చివరి రోజు పోచంపల్లిలో చేనేత సమస్యలపై ఆరా..

సాక్షి, యాదాద్రి, భూదాన్ పోచంపల్లి : సీఎల్పీ భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర భువనగిరి జిల్లాలో ఏడు రోజులు కొనసాగింది. జనగామ జిల్లా నుంచి భువనగిరి జిల్లా ఆలేరు మండలం శ్రీనివాసపురం వద్ద ఏప్రిల్ 30న ప్రారంభమైన యాత్ర శనివారం(మే 6) ముగిసింది. 86 కిలోమీటర్ల మేర సాగిన ఈ యాత్ర శనివారం మధ్యాహ్నం భూదాన్ పోచంపల్లి మండలం జలాల్‌పురం గ్రామం నుంచి రంగారెడ్డి జిల్లాలోకి ప్రవేశించింది. ఆలేరు నియోజకవర్గంలో 48 కిలోమీటర్లు, భువనగిరి నియోజకవర్గంలో 38 కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. భువనగిరిలో 600 కిలో మీటర్ల మైలు రాయిని, బీబీనగర్‌లో 50 రోజుల పాదయాత్రను పూర్తి చేసుకున్నారు. నల్లగొండ ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బీర్ల అయిలయ్య, పలువురు టీపీసీసీ నాయకులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు సంఘీభావం

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే చేనేత కార్మికులను అన్ని విధాలుగా ఆదుకొంటామని సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క చెప్పారు. ఆయన చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర 51వ రోజు శనివారం ఉదయం భూదాన్ పోచంపల్లి పట్టణ కేంద్రంలోని పద్మశాలి సభావేదిక వద్ద నుంచి ప్రారంభమైంది. అక్కడ నుంచి ఆయన ఆచార్య కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహం వద్ద చేనేత జన సమాఖ్య ఆధ్వర్యంలో చేనేత కార్మికులు చేపట్టిన దీక్షా శిబిరాన్ని సందర్శించారు. చేనేత పథకాల అమలులో కఠిన నిబంధనలు విధించడం వల్ల 60 శాతంకు పైగా పథకాలను పొందలేకపోతున్నారని, హక్కుల కోసం పోరాడిన పలువురు చేనేత కార్మికులపై కేసులు పెట్టి వేధిస్తున్నారని పలువురు చేనేత కార్మికులు భట్టి విక్రమార్క దృష్టికి తీసుకొచ్చారు. చేనేత బీమా వయస్సుతో సంబంధం లేకుండా అమలు చేసేలా చూడాలని కోరారు. మల్లు భట్టి విక్రమార్క స్పందించి.. మేనిఫెస్టోలో పెట్టి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం అక్కడ నుంచి వేముల సత్యం అనే చేనేత కార్మికుడి ఇంటిని సందర్శించారు. నూలు సబ్సిడీ వస్తుందా అని, ఎన్ని రోజుల్లో చీర నేస్తావని, ఎంత కూలి వస్తుందని అడిగి తెలుసుకొన్నారు. సకాలంలో నూలు సబ్సిడీ రావడంలేదని, నూలుపై జీఎస్టీని విధించడం వల్ల కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం పోచంపల్లిలో ఎంపీడీఓ కార్యాలయం వద్ద జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సమ్మె శిబిరాన్ని భట్టివిక్రమార్క సందర్శించి వారికి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు పోత్నక్ ప్రమోద్‌కుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తడక వెంకటేశం, రవికుమార్, వలిగొండ ఎంపీపీ నూతి రమేశ్, మండల పార్టీ అధ్యక్షుడు పాక మల్లేశ్‌యాదవ్, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు మర్రి నర్సింహారెడ్డి, మున్సిపల్ కోర్‌కమిటీ కన్వీనర్ భారత లవకుమార్ ఉన్నారు.

కాంటాల్లో జాప్యం.. రాశుల తరలింపు

- కేంద్రానికి ధాన్యం తెచ్చి నెల దాటినా కొనుగోలు చేయని నిర్వాహకులు
- ధాన్యాన్ని వేరే సెంటర్లకు తీసుకెళ్తున్న రైతులు
- అకాల వర్షాలు కురుస్తున్నా అధికారులు స్పందించడం లేదని ఆరోపణలు



మాడుగులపల్లిలో ధాన్యం రాశిని జేసీబీ సాయంతో ట్రాక్టర్‌లోకి లోడు చేస్తున్న రైతు

మాడుగులపల్లి : ధాన్యం కొనుగోళ్లలో ఎడతెగని జాప్యం జరుగుతోంది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పోసి నెల గడిచినా కాంటాలు పూర్తికాకపోవడంతో రైతులు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. పుండుమీద కారం చల్లినట్లు అకాల వర్షాలూ తోడవడంతో ధాన్యాన్ని కాపాడుకునేందుకు నానాతంటాలు పడుతున్నారు. కేంద్రాల్లో రాశులు పేరుకుపోవడంతో సహనం కోల్పోయి ప్రత్యామ్నాయంగా ధాన్యాన్ని సమీప కేంద్రాలకు తరలిస్తున్నారు.

మాడుగులపల్లిలో మారని కొనుగోళ్ల తీరు..

మాడుగులపల్లి మండల కేంద్రంలో తిప్పర్తి పీఏసీఎస్ ఆధ్వర్యంలో నెల క్రితం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అంతకు 15 రోజుల ముందే చాలా మంది సమీప గ్రామాల రైతులు ఇక్కడ ధాన్యం పోశారు. కొనుగోళ్లు ప్రారంభమై నెల గడుస్తున్నా కాంటాలు కాకపోవడం.. బస్తాలు తరలించేందుకు సకాలంలో లారీలు రాకపోవడంతో కొనుగోళ్లలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఇటీవల అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రోజుకు నాలుగు నుంచి ఆరు లారీలు పంపించాలని అధికారులను ఆదేశించినా పరిస్థితిలో మార్పు రాలేదు. బస్తాలను తరలించేందుకు లారీల డ్రైవర్లు బస్తాకు రూపాయి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని ఆరోపణలున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే కొనుగోళ్లు పూర్తయ్యేందుకు నెలకుపైగా పట్టే అవకాశముందని అభిప్రాయపడుతున్నారు. సమస్యలకు నెలవుగా ఉన్న ఈ కేంద్రం నుంచి పలువురు ధాన్యాన్ని ప్రత్యామ్నాయ కేంద్రాలకు తరలించేందుకు సిద్ధమవుతున్నారు. శనివారం ఓ రైతు జేసీబీ తీసుకొచ్చి కొనుగోలు కేంద్రంలో పోసిన ధాన్యాన్ని ట్రాక్టర్‌లో లోడ్ చేసుకొని వెళ్లిపోవడం ఇక్కడి పరిస్థితికి అద్దం పడుతోంది. ఈ కొనుగోలు కేంద్రంలో సమస్యలపై వివరణ కోరేందుకు తిప్పర్తి పీఏసీఎస్ సీఈఓ భిక్షమయ్యను సంప్రదించేందుకు ప్రయత్నించగా ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు.

నెల గడిచినా కాంటా కాలేదు..



మాడుగపల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యం పోసి నెల రోజులపైనే గడిచింది. ఇక్కడి కొనుగోళ్ల ప్రక్రియ అధ్వానంగా ఉంది. ఇదే పరిస్థితి ఉంటే మరో నెల గడిచినా కొనుగోళ్లు పూర్తి కావడం కష్టమే. చేసేది లేక మరో ప్రాంతంలోని ఐకేపీ కేంద్రానికి ధాన్యాన్ని తీసుకెళ్తున్న. ఈ పరిస్థితి మునుపెన్నడూ చూడలేదు. అకాల వర్షాలు కురుస్తున్నా అధికారులు స్పందించకపోవడం దారుణం.

- కట్టా సైదిరెడ్డి, రైతు, మర్రిగూడెం

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష



నల్లగొండలో పరీక్ష కేంద్రం వద్ద జనం

నల్లగొండ : గురుకుల జూనియర్ కాలేజీ ప్రవేశ పరీక్ష శనివారం ప్రశాంతంగా సాగింది. తెలంగాణ స్టేట్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం మొత్తం 7056 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. 5,976 మంది పరీక్షకు హాజరయ్యారు. నల్లగొండ పట్టణంలో 30 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. డీఈఓ భిక్షపతి పట్టణంలోని సెయింట్ ఆల్ఫోన్సెస్ స్కూల్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు.

క్లుప్తంగా

జూన్ నాటికి మొదటి దశ పాఠశాలలు ముస్తాబు

గుర్రంపోడు : మన ఊరు మన బడి కింద మొదటి దశలో ఎంపికైన పాఠశాలల్లో జూన్ నాటికి అన్ని పనులు పూర్తి చేసి రంగులతో ముస్తాబు చేయాలని డీఈ శైలజ ఎస్‌ఎంసీ చైర్మన్, సర్పంచ్‌లకు సూచించారు. శనివారం మండలంలోని తేనపల్లి, చామలేడు, పిట్టలగూడెం పాఠశాలల్లో పనులను పరిశీలించిన సందర్భంగా మాట్లాడారు. పనుల్లో సాంకేతిక పరమైన సలహాలు అందించడానికి తాము సిద్ధంగా ఉన్నామని అన్నారు. పిట్టలగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో డైనింగ్ హాల్, మంచినీటి మోటారు, ట్యాంకులు త్వరితగతిన ఏర్పాటు చేయాలని సూచించారు. డీఈ వెంట ఏఈ రవికుమార్, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం భాగం హిమజ, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శ్రీరాంరెడ్డి, కంట్రాక్టర్ పాలడుగు శేఖర్ తదితరులు ఉన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

చౌటుప్పల్ : మండల పరిధిలోని తూప్రాన్‌పేట గ్రామంలో శనివారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమయ్యింది. ఎస్‌ఐ సీత పాండు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలోని మసీదు వద్ద 45–50 సంవత్సరాల మధ్య వయసుగల వ్యక్తి చనిపోయి ఉన్నాడు. సాయంత్రం నాలుగున్నర గంటల సమయంలో అటుగా వెళ్లిన స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లారు. పరిసరాలను పరిశీలించారు. మృతుడు చెత్త సేకరించే వ్యక్తిగా అనుమానిస్తున్నారు. ఫిట్స్ లేదంటే ఇతర అనారోగ్య కారణాలతో చనిపోయి ఉంటాడని భావిస్తున్నారు. మృతుడు ఎవరనే విషయం తెలియరాలేదు. మృతదేహాన్ని చౌటుప్పల్‌లోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి


ఎంజీయూ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు

నల్లగొండ రూరల్: మహాత్మాగాంధీ యూనివర్సిటీలో కాంట్రాక్ట్ అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ శనివారం యూనివర్సిటీ గేట్ వద్ద కాంట్రాక్టు అధ్యాపకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జేఎల్, డీఎల్ కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేసిన మాదిరిగానే తమను కూడా ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంట్రాక్టు అధ్యాపకులు డాక్టర్ చింత శ్యాంసుందర్, డాక్టర్ తిరుపతి, డాక్టర్ రవీందర్‌రెడ్డి, డాక్టర్ కిరణ్, మురళి మోహన్, డాక్టర్ శేఖర్, స్వప్న, సమ్రీన్, శ్రీనివాస్, పాండరయ్య పాల్గొన్నారు.

యువకుడిని బలిగొన్న ఈత సరదా

- బావిలో మునిగి మృతి
- కల్యాణానికి వచ్చి కానరాని లోకాలకు..


బావిలో మృతదేహాన్ని వెతుకుతున్న గ్రామస్తులు


నరేశ్ మృతదేహం

తుర్కపల్లి: దేవుని కల్యాణానికి కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన ఓ యువకుడు బావిలో మునిగి మృతిచెందాడు. తుర్కపల్లి మండలం వెంకటాపూర్‌లో చోటు చేసుకున్న ఈ విషాదకర ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన శివరాత్రి ప్రభాకర్, వెంకటమ్మకు ముగ్గురు కొడుకులు. స్థానికంగా ఉపాధి లేక పోవడంతో మేడ్చల్ జిల్లా జమ్మిగడ్డకు వలస వెళ్లి అక్కడే కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో 5వ తేదీన వెంకటగిరి లక్ష్మీనర్సింహ్మ స్వామి కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు ప్రభాకర్, వెంకటమ్మల కుమారుడు నరేశ్(20) గ్రామానికి వచ్చాడు. శనివారం మిత్రులతో కలిసి క్రికెట్ ఆడాడు. అనంతరం మైదానం పక్కనే ఉన్న బావిలో ఈత కొట్టేందుకు వెళ్లారు. ఈ క్రమంలో నరేశ్ బావిలోకి దిగి ఈతకొడుతుండగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. స్నేహితులు అతడిని కాపాడేందుకు ప్రయత్నించినా సాధ్యపడలేదు. దీంతో గ్రామస్తులకు విషయం తెలిపారు. వెంటనే పోలీసులు, అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో రూరల్ సీఐ సురేందర్‌రెడ్డి సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఫైర్ సిబ్బంది బావిలోకి దిగి మృతదేహాన్ని బయటకు తీసారు. గ్రామంలో పండుగా వాతావరణం ఉండగా ఈ ప్రమాదం చోటు చేసుకోవడంతో విషాదఛాయలు నెలకొన్నాయి. పోస్టుమార్టమ్ నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రాఘవేందర్ గౌడ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం

డిండి: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం చెందారు. డిండి, యాదగిరిగుట్ట మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. గుర్రంపోడు మండలం పెద్దబావిగుడెం గ్రామానికి చెందిన తొంట యాదగిరి తన భార్య కవిత(36)తోపాటు సోదరుడు నరేష్‌తో కలిసి కొంతకాలంగా దేవరకొండలో నివాసం ఉంటున్నారు. కాగా, శనివారం డిండి ప్రాజెక్టు సమీపంలో ఉన్న కట్టమైసమ్మ తల్లిని దర్శించుకునేందుకు నరేశ్, కవిత, తన ఇద్దరు పిల్లలతో కలిసి బైక్‌పై బయలుదేరారు. మార్గమధ్యలో మండల పరిధిలోని చెర్కుపల్లి గేటు సమీపంలోకి రాగానే బైక్‌కు అకస్మాత్తుగా కుక్క అడ్డుగా వచ్చింది. దీంతో బైక్ నడుపుతున్న నరేష్ సడన్ బ్రేక్ వేసాడు. దీంతో వెనుకాల కూర్చున్న కవిత ఎగిరి రోడ్డుపై పడింది. దీంతో ఆమె తలకు బలమైన గాయాలయ్యాయి. ఆమెను దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కానిస్టేబుల్ రవీందర్‌రెడ్డి తెలిపారు.


కవిత (ఫైల్)

పండగకు వెళ్లి వస్తూ ..

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట మండలంలోని రామాజీపేట గ్రామానికి చెందిన ఆరె శివ (23) ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మండలంలోని తాళ్లగూడెం గ్రామంలోని బంధువుల ఇంటికి పండుగ నిమిత్తం శుక్రవారం వెళ్లాడు. పండుగ అనంతరం అర్ధరాత్రి, తమ బావ పచ్చిమట్ల రామును బైక్ మీద ఎక్కించుకుని తాళ్లగూడెం నుంచి బయలుదేరారు. ఈ క్రమంలో బాహుపేట పరిధిలోకి రాగానే బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న కరెంటు పోల్ సపోర్ట్ వైర్‌కు అతివేగంతో ఢీకొట్టింది. దీంతో బైక్‌ను నడుపుతున్న శివ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. కాగా, వెనక కూర్చున్న బంధువు రాముకి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామకృష్ణారెడ్డి తెలిపారు.

దొంగతనానికి వచ్చి.. ఒకరిని చంపి..

- ఆగాపల్లిలో కూలీ హత్య
- హతుడు అడ్డగూడూరు మండలం చిన్న పడిశాల గ్రామ వాసి

మంచాల: దొంగతనానికి వచ్చిన దుండగులు.. అక్కడే నిద్రిస్తున్న ఓ కూలీని హత్య చేశారు. ఈ సంఘటన మంచాల మండలం ఆగాపల్లిలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. సీఐ వెంకటేశ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఎస్‌ఆర్ పెట్రోల్ బంక్ యజమానికి సంబంధించిన మామిడి తోటలో యాదాద్రి జిల్లా అడ్డగూడూరు మండలం చిన్న పడిశాల గ్రామానికి చెందిన రామచంద్రయ్య దంపతులు కాపరులుగా పనిచేస్తున్నారు. రెండు రోజుల క్రితం అదే గ్రామానికి చెందిన సుక్క సోమయ్య (70)ను కూలి పని కోసం పిలుపించుకున్నారు. శుక్రవారం రాత్రి భోజనాలు చేశాక.. రామచంద్రయ్య అతని భార్య గదిలో నిద్రించగా.. సోమయ్య మాత్రం వరండాలో నిద్రించాడు. అర్ధరాత్రి కొంతమంది దుండగులు తలుపులు తీయాలని బెదిరించారు. రామచంద్రయ్య దంపతులు భయపడి తలుపులు తీయలేదు. దీంతో ఆగ్రహించిన దుండగులు.. బయట నిద్రిస్తున్న సోమయ్య తలపై బలంగా కొట్టి పరారయ్యారు. వారు వెళ్లిపోయిన తర్వాత తలుపులు తీసి చూడగా.. సోమయ్య తల పగిలి రక్తపు మడుగులో విగత జీవిగా పడి ఉన్నాడు. వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించారు. సీఐ వెంకటేశ్ ఘటనా స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దుండగులు తలపై బలంగా కొట్టడంతో సోమయ్య చనిపోయి ఉంటాడని, అందుకు సంబంధించిన వివరాలను సేకరిస్తున్నామని సీఐ వెంకటేశ్ తెలిపారు.

మున్సిపల్ ఉద్యోగిపై గొడ్డలితో దాడి

సూర్యాపేట క్రైం : అనుమతి లేని నిర్మాణాలను ఆపాలని కోరినే మున్సిపల్ ఉద్యోగిపై శనివారం ఓ వ్యక్తి గొడ్డలితో దాడి చేశాడు. ఈ ఘటన సూర్యాపేటలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరమ్మ మూడో విడత కాలనీలో అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టారని మున్సిపాలిటీలోనీ టౌన్ ప్లానింగ్ విభాగంలో పనిచేస్తున్న భిక్షం అక్కడికి వెళ్లాడు. చేపడుతున్న నిర్మాణాలు ఆపాలని నిర్మాణదారుడు నవిల్లే భద్రయ్యను కోరాడు. దీంతో భద్రయ్య ఆగ్రహంతో మున్సిపల్ ఉద్యోగితో ఘర్షణకు దిగాడు. ఒక్కసారిగా గొడ్డలి తీసుకొని దాడి చేయడంతో తలకు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న సూర్యాపేట మున్సిపల్ కమిషనర్ రామాంజులరెడ్డి ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. వెంటనే సిబ్బంది పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయగా పోలీసులు నిందితున్ని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.


ఉద్యోగిని పరామర్శిస్తున్న మున్సిపల్ కమిషనర్

ఉద్యోగులపై దాడి చేస్తే కఠిన చర్యలు

సూర్యాపేట : విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులపై దాడులు చేస్తే ఊరుకునేది లేదని సూర్యాపేట కలెక్టర్ వెంకట్రావు హెచ్చరించారు. శనివారం దాడికి గురైన మున్సిపల్ ఉద్యోగి భిక్షంను స్థానిక ఆస్పత్రిలో పరామర్శించి మాట్లాడారు.దాడికి సంబంధించిన వివరాలను మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డిని అడిగి తెలుసుకున్నారు.

8 నుంచి తెలంగాణ భూమి కారవాన్-2 యాత్ర


- యాదాద్రి జిల్లా నుంచి జనగామ జిల్లా వరకు

సాక్షి, యాదాద్రి : రైతుల న్యాయ అవసరాలు, వారి భూమి ఆకాంక్షలు తెలుసుకోవడం కోసం తెలంగాణ భూమి కారవాన్ –2 యాత్రను ఈ నెల 8న చేపడుతున్నట్లు లీఫ్స్ సంస్థ ఉపాధ్యక్షుడు జీవన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ప్రారంభమయ్యే ఈ యాత్ర యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి, మోటకొండూర్, ఆత్మకూరు, మోత్కూర్, గుండాలతో పాటు జనగామ జిల్లా దేవరుప్పుల, పాలకుర్తి, ఘనపూర్ మండలాల వరకు సాగుతుందని తెలిపారు. ఏప్రిల్ 10న భూమి సునీల్ ఆధ్వర్యంలో లీఫ్స్ సంస్థ తెలంగాణ భూమి కారవాన్–1ని ప్రారంభించామన్నారు. రెండో విడత కారవాన్ ద్వారా రైతుల న్యాయ అవసరాలను తెలుసు కోవాలనుకుంటున్నామన్నారు. రైతులకు న్యాయ సేవలను అందించడం కోసం మరిన్ని మెరుగైన కార్యక్రమాలను రూపొందించడానికి ఈ సమాచారం ఉపయోగపడుతుందన్నారు. వారి అభిప్రాయాల ఆధారంగా మరోసారి తెలంగాణ ప్రజల భూమి మానిఫెస్టోని రూపొందిస్తామని తెలిపారు.

రాచకొండకు పూర్వ వైభవం


స్వామివారిని అభిషేకిస్తున్న విద్యాశంకర భారతి మహాస్వామిజీ

సంస్థాన్ నారాయణపురం: రాచకొండకు పూర్వ వైభవం వచ్చే అవకాశం ఉందని జగద్గురు పుష్పగిరి మహా సంస్థానం పీఠాధిపతి విద్యాశంకర భారతి మహాస్వామిజీ ఆశాభావం వ్యక్తం చేశారు. రాచకొండలోని పూరాతన, చారిత్రక శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో శనివారం రాచప్ప సమితి ఆధ్వర్యంలో జయంతి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిజీ ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. శ్రీలక్ష్మీనర్సింహస్వామిని జల, క్షీరాలతో అభిషేకించారు. పూర్ణహుతి చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన భక్తులకు సూక్తులు తెలియజేశారు. నియమ, నిష్ఠలతో నిత్యం భగవంతుని ఆరాధించాలన్నారు. కార్యక్రమంలో రాచప్ప సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బద్దుల కృష్ణకుమార్, సూరపల్లి వెంకటేశం, కదారి అంజిరెడ్డి, పద్మశ్రీ అవార్డు గ్రహీత గజం గోవర్ధన్, మాజీ జెడ్పీటీసీ బోల్ల శివశంకర్, శ్రీరామ్, పవన్, శ్రీనివాస్, సాయికుమార్, నగేష్, శ్రీకాంత్, మధుసూదన్‌రెడ్డి, అర్చకుడు లక్ష్మణాచార్యులు ఉన్నారు.


భక్తులతో విద్యాశంకర భారతి మహాస్వామిజీ

అప్పుడే పుట్టిన శిశువుకు సీపీఆర్

గుర్రంపోడు: ఆసుపత్రికి తరలిస్తుండగా 108 వాహనంలోనే మహిళ ప్రసవించగా పేగు మెడకు చుట్టుకుని జన్మించిన శిశువుకు సీపీఆర్ చేసి ప్రాణాపాయస్థితి నుంచి 108 సిబ్బంది రక్షించారు. గుర్రంపోడులో శనివారం సాయంత్రం జరిగింది. చింతపల్లికి చెందిన ఎం.మహేశ్వరిని నల్లగొండ ఆసుపత్రికి తరలిస్తుండగా గుర్రంపోడు శివారులో 108 వాహనంలో మగబిడ్డకు జన్మనిచ్చింది. బిడ్డలో చలనం లేకపోవడం, పేగు మెడకు చుట్టుకుని రంగుమారి ఉండటాన్ని గమనించిన ఈఎంటీ గిరి, పైలట్ వెంకటేశ్వర్లు ఫోన్‌లో వైద్యుల సలహాతో సీపీఆర్ చేసి గుండెలో చలనాన్ని కల్గించారు. అనంతరం నల్లగొండ ఆసుపత్రికి చేర్చగా సరైన సమయంలో చికిత్స అందించి శిశువు ప్రాణాలు కాపాడిన 108 సిబ్బందిని డాక్టర్లు అభినందించారు.


108లో జన్మించిన శిశువుతో సిబ్బంది

పశువుల దొంగల ముఠా అరెస్ట్

- రూ.1.60 లక్షల నగదు, రెండు కార్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన భువనగిరి డీసీపీ రాజేశ్ చంద్రా


సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ రాజేశ్ చంద్రా

భువనగిరి : పశువులను అపహరించుకుపోతున్న ముగ్గురు దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం తన కార్యాలయంలో భువనగిరి డీసీపీ రాజేశ్ చంద్రా నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టి వివరాలు వెల్లడించారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా జీడిమెట్ల, సూరారం పరిధిలోని రాజీవ్‌గాంధీ నగర్‌కు చెందిన మహ్మద్ సోహెల్, పల్ల ఠాకూర్‌రాజ్ సింగ్, మహ్మద్ వసీమ్‌తో పాటు మరో బాలుడు కలిసి కొంతకాలంగా గ్రామ శివారుల్లోని పశువుల కొట్టాల వద్ద గేదెలు, ఆవులు, మేకలు, గొర్రెలను అపహరిస్తున్నారు. సమీపంలో ఏర్పాటు చేసుకున్న వాహనంలో వాటిని ఎక్కించి ఇతర ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 3వ తేదీన తెల్లవారుజామున బొమ్మలరామారం మండలం నాగినేనిపల్లి గ్రామంలో రామిడి మల్లారెడ్డి వ్యవసాయ బావి వద్దకు చేరుకున్నారు. అక్కడ కొట్టంలోని ఆవులు, గేదెలు, మేకలను తమ వెంట తెచ్చుకున్న వాహనంలోకి ఎక్కిస్తున్నారు. ఈ క్రమంలో పశువులు అరవగా స్థానికులు గమనించి కేకలు వేశారు. దీంతో ఎవరో వస్తున్నట్లు భావించి భయంతో వెంటనే పశువులతో పాటు వాహనాన్ని అక్కడే వదిలి పారిపోయారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కాగా, శుక్రవారం తెల్లవారుజామున పోలీసులు బొమ్మలరామారం చౌరస్తా వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో వారికి అనుమానాస్పదస్థితిలో కనిపించిన ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించగా నాగినేనిపల్లి గ్రామంలో పశువుల దొంగతానికి యత్నించినట్లు ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1.60లక్షలు, రెండు కార్లు, అశోక్ లేలాండ్ వాహనాన్ని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. నిందితుల్లో మహ్మద్ సోహెల్, ఠాకూర్‌రాజ్ సింగ్ హైదరాబాద్‌లోని దుండిగల్‌లో ఓ ఇంట్లో చోరీ, రెనిబజార్ పరిధిలో పశువుల దొంగతనానికి పాల్పడి జైలుకు సైతం వెళ్లి వచ్చారు. కాగా, ఇప్పటికే వీరిపై భువనగిరి రూరల్, యాదరగిరిగుట్ట పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదైనట్లు డీసీపీ తెలిపారు. సమావేశంలో ఏసీపీ వెంకట్ రెడ్డి, సీఐ వెంకటయ్య, ఎస్‌ఐ వెంకన్న పాల్గొన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న కర్నాటి విజయ్‌కుమార్

నల్లగొండ టూటౌన్: గ్రూప్స్ ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్న ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగ యువతకు తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కేవీకే ఫౌండేషన్ చైర్మన్ కర్నాటి విజయ్‌కుమార్ తెలిపారు. శనివారం నల్లగొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 8న నల్లగొండలోని చిన వెంకట్‌రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఉదయం 9గంటలకు ఉచిత కోచింగ్‌పై నిరుద్యోగులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రూప్ 2, 3, 4 అభ్యర్థులు ఇంటి వద్దే ఉండి శిక్షణ పొందేలా ఆన్‌లైన్ కోర్సులకు రూపకల్పన చేశామని, ఈ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎం.జగదీష్, స్క్వాడ్రన్ లీడర్ జయసింహా, పలువురు ప్రముఖులు హాజరవుతున్నట్లు చెప్పారు. సమావేశంలో ఎంవీఆర్ విద్యా సంస్థల చైర్మన్ కొలనుపాక రవికుమార్, శ్రీనివాస్, రావిరాల వెంకట్ పాల్గొన్నారు.